సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం


మంగళవారం । 6 । ఆగస్టు । 2024



సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

గిరిజన దర్బార్‌లో సమర్పించిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ అన్నారు.

8లో



అటవీ అధికారుల విచారణ

ములకలపల్లి మండలం గండిపోలులో టేకు చెట్ల తొలగింపుపై అటవీశాఖ అధికారులు విచారణ చేపట్టారు.

8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 29° / 25°

జిల్లాలో మంగళవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. అక్కడక్కడా చిన్నపాటి జల్లులు పడొచ్చు.

న్యూస్‌రీల్

రామయ్యకు ముత్తంగి అలంకరణ

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారు ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతీ సోమవారం స్వామివారిని ఈ రూపంలో అలంకరించడం ప్రత్యేకత. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం జరిపించారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

నేటి నుంచి జలశక్తి అభియాన్ బృందం పర్యటన

చుంచుపల్లి: జిల్లాలోని పలు గ్రామాల్లో జలశక్తి అభియాన్ సెంట్రల్ టీమ్ మంగళవారం నుంచి మూడు రోజుల పాటు పర్యటించనుంది. ఈ మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన ఇద్దరు ఐఏఎస్ అధికారులు సోమవారం కొత్తగూడెం చేరుకున్నారు. వీరితో పాటు కలెక్టర్ జితేష్ వి.పాటిల్, అధికారులు గ్రామాల్లో అభివృద్ధి పనులను పరిశీలిస్తారు.

జలవనరులశాఖ ఇన్‌చార్జ్ సీఈగా విజయభాస్కర్

పాల్వంచరూరల్ : జలవనరుల శాఖ సీఈ శ్రీనివాసరెడ్డి ఈనెల 15 వరకు సెలవుపై అమెరికా వెళ్లారు. ఆయన స్థానంలో ములుగు జిల్లా సీఈ విజయభాస్కర్‌ను ఇన్‌చార్జ్‌గా నియమించగా సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

బీజేపీ తీరుతో అంధకారం

సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు విజయరాఘవన్

సింగరేణి(కొత్తగూడెం): బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చాక ప్రజల జీవన పరిస్థితి అంధకారంలోకి నెట్టేసినట్లయిందని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు విజయరాఘవన్ అన్నారు. బొగ్గు గనులు వేలం వేయకుండా సింగరేణికే అప్పగించాలనే డిమాండ్‌తో సింగరేణి పరిరక్షణ పేరిట గోదావరిఖనిలో ప్రారంభించిన యాత్ర సోమవారం కొత్తగూడెంలో ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ వైఖరితో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, ప్రజల కొనుగోలు శక్తి పడిపోయిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు వ్యతిరేకించే ధైర్యం ఎర్రజెండాకు మాత్రమే ఉందన్నారు. అందుకే సింగరేణి పరిరక్షణ కోసం నిర్విరామ పోరాటం చేస్తున్నామని చెప్పారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎస్.వీరయ్య మాట్లాడుతూ సింగరేణి బ్లాక్‌ల వేలం ప్రక్రియకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. నాయకులు పోతినేని సుదర్శన్, భూపాల్, కాసాని అయిలయ్య, మందా నర్సింహారావు, జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, జగదీష్, మచ్చా వెంకటేశ్వర్లు, ఏజే రమేష్, జ్యోతి, లిక్కి బాలరాజు పాల్గొన్నారు.

మండల పరిషత్‌లకు ప్రత్యేకాధికారులు

చుంచుపల్లి: జిల్లాలో బూర్గంపాడు మినహా మిగిలిన 20 మండల ప్రజా పరిషత్‌ల పదవీ కాలం ముగియడంతో ప్రత్యేకాధికారులను నియమిస్తూ కలెక్టర్ జితేష్ వి.పాటిల్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆళ్లపల్లికి ఇల్లెందు ఏడీఏ పి.వాసవిరాణి, అన్నపురెడ్డిపల్లికి డీఎస్సీడీఓ డి.అనసూర్య, అశ్వాపురానికి మత్స్య శాఖ అధికారి ఎండీ.ఇంతియాజ్, అశ్వారావుపేటకు వెటర్నరీ ఏడీ ప్రదీప్‌కుమార్, చండ్రుగొండకు మైనార్టీ సంక్షేమాధికారి కె.సంజీవరావు, చర్లకు భద్రాచలం ఏడీఏ బి.సుధాకర్, చుంచుపల్లికి డీఐఈఓ బి.సులోచనారాణి, దమ్మపేటకు ఏడీఏ అఫ్జల్‌బేగం, దుమ్ముగూడేనికి ఐటీడీఏ డీడీ మణెమ్మ, గుండాలకు డీసీఓ ఖుర్షీద్, జూలూరుపాడుకు డీఎస్ఓ పి.రుక్మిణీదేవి, కరకగూడేనికి ఏడీ మైన్స్ జి.దినేష్‌కుమార్, లక్ష్మీదేవిపల్లికి డీఏఓ బాబూరావు, మణుగూరుకు డీఎంఓ అలీమ్, ములకలపల్లికి డీజీడబ్ల్యూఓ ఎం.రమేష్, పాల్వంచకు ఇండస్ట్రీస్ జీఎం తిరుపతయ్య, పినపాకకు ఏడీఏ తాతారావు, సుజాతనగర్‌కు సివిల్ సప్లై డీఎం ఎస్.త్రినాథ్ బాబు, టేకులపల్లికి ఉపాధి కల్పనాధికారి కె.శ్రీరామ్, ఇల్లెందుకు హార్టికల్చర్ అధికారి కె.సూర్యనారాయణను నియమించారు.

8న ఉద్యోగ మేళా

కొత్తగూడెంఅర్బన్: 2023–24లో ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులకు హెచ్‌సీఎల్ టెక్‌బీ కంపెనీలో డీపీఓగా అవకాశం కల్పించేందుకు ఈ నెల 8న ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు డీఐఈఓ సులోచనరాణి తెలిపారు. సీఈసీ, బైపీసీ, హెచ్ఈసీతో పాటు ఒకేషనల్ గ్రూప్‌ల్లో 75శాతం మార్కులు సాధించిన విద్యార్థులు అర్హులన్నారు. ఆసక్తి ఉన్నవారు 8న కొత్తగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగే ఉద్యోగ మేళాకు హాజరుకావాలని సూచించారు. వివరాలకు 83414 05102, 90109 26721 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

కేటీపీఎస్ ఓఅండ్ఎం 'ఏ' స్టేషన్‌లోని కూలింగ్ టవర్లు



సీ స్టేషన్‌లో నేలమట్టం అవుతున్న రెండు కూలింగ్ టవర్లు



టవర్లు కూల్చివేత తర్వాత ఇలా..



అన్నింటా రికార్డే..

కేటీపీఎస్ టవర్ల నిర్మాణం, కూల్చివేతల్లో ప్రత్యేకత

- 1960వ దశకంలో సవాళ్ల మధ్య పూర్తయిన పనులు
- ఆ తర్వాత ఊపందుకున్న పారిశ్రామిక రంగం
- కాలం చెల్లడంతో ప్రస్తుతం కాలగర్భంలోకి..



టవర్ల కూల్చివేత సాఫీగా పూర్తయిన ఉత్సాహంలో అధికారులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: దేశానికి స్వాతంత్రం వచ్చిన తర్వాత మూడో పంచవర్ష ప్రణాళికలో పారిశ్రామిక రంగానికి పెద్దపీట వేశారు. దీంతో దేశవ్యాప్తంగా 1960వ దశకంలో థర్మల్ పవర్ స్టేషన్ల నిర్మాణం ఊపందుకుంది. ఈ క్రమంలో పాల్వంచలో కొత్తగూడెం థర్మల్ విద్యుత్ స్టేషన్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కాలం తీరడంతో ఇప్పుడు కూల్చేశారు. అయితే కూల్చివేత పనుల్లోనూ కేటీపీఎస్ అనేక రికార్డులు సొంతం చేసుకుంది.

ఎనిమిది యూనిట్లు..

కేటీపీఎస్ ప్లాంట్ నిర్మాణానికి జపాన్ సాంకేతిక సహకారం అందించగా తొలి యూనిట్ నిర్మాణానికి రూ.59.29 కోట్లు ఖర్చయ్యాయి. కొత్తగూడెం థర్మల్ విద్యుత్ కేంద్రం (కేటీపీఎస్) తొలి యూనిట్ 60 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో 1966 సెప్టెంబర్ 4న ప్రారంభమైంది. ఆ తర్వాత మరో మూడు యూనిట్లు 1967లో అందుబాటులోకి వచ్చాయి. ఈ నాలుగు యూనిట్లు (60 X4=240) కలిపి కేటీపీఎస్ ఏ ప్లాంట్‌గా పేర్కొనేవారు. ప్లాంట్–ఏలో ఒక్కో కూలింగ్ టవర్ 102 మీటర్ల ఎత్తులో నిర్మించారు. అనంతరం కేటీపీఎస్ విస్తరణలో భాగంగా 1974లో 120X2=240 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో కేటీపీఎస్ ప్లాంట్ బీ, 1978లో 120X2=240 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో ప్లాంట్ సీ మొదలయ్యాయి. బీ, సీ ప్లాంట్లలోని కూలింగ్ టవర్లను 115 మీటర్ల ఎత్తులో నిర్మించారు.

కట్టడానికి ఆఫ్రికా కూలీలు..

కేటీపీఎస్ నిర్మాణం అనేక సవాళ్ల మధ్య ముందుకు సాగింది. ముఖ్యంగా 102 మీటర్లు (335 అడుగులు) ఎత్తుతో నిర్మించే కూలింగ్ టవర్, అంతే ఎత్తుతో ఉండే చిమ్నీల నిర్మాణం అప్పటి అధికారులు, ఇంజనీర్లకు సవాల్‌గా మారింది. ఎత్తయిన కూలింగ్ టవర్ల నిర్మాణ పనుల్లో భాగమయ్యేందుకు స్థానికులు భయపడ్డారు. దీంతో ఆఫ్రికా నుంచి కూలీలను రప్పించి నిర్మాణ పనులు మొదలెట్టారు. అప్పటికీ కూలీల కొరత ఉంటే ఒడిశాలోని పారదీప్ నుంచి మరికొందరిని రప్పించారు. అలా నాలుగేళ్లకు పైగా శ్రమించి కేటీపీఎస్ ప్లాంట్ 'ఏ' అందుబాటులోకి తెచ్చారు. దట్టమైన అడవుల మధ్య కొండల కంటే ఎత్తుగా నిర్మించిన కూలింగ్ టవర్లను అంతా ఆశ్చర్యంగా చూసేవారు. ముఖ్యంగా ఆ రోజుల్లో భద్రాచలం శ్రీరాముడి దర్శనానికి వచ్చే భక్తులు కూలింగ్ టవర్లను వింతగా చూసేవారు.

పరిశ్రమలకు ఊపిరి..

కేటీపీఎస్ ప్రారంభంతో జిల్లాలో పారిశ్రామిక రంగంలో జోరు పెరిగింది. 1970వ దశకంలో ఏపీ స్టీల్స్, నవభారత్ ఫెర్రోఎల్లాయిస్, స్పాంజ్ ఐరన్ కర్మాగారం, బేరియం కెమికల్స్, భద్రాచలం పేపర్ బోర్డు లిమిటెడ్ ఏపీ రేయాన్స్ (మంగపేట, ములుగు జిల్లా), మణుగూరు హెవీ వాటర్ ప్లాంట్ వంటి పరిశ్రమలను చకచకా స్థాపించారు. సింగరేణి బొగ్గు గనుల్లో యాంత్రీకరణ ఊపందుకుంది. అంతే కాదు.. 1980వ దశకం వచ్చే సరికి హైదరాబాద్ నగర విద్యుత్ అవసరాలకు కేటీపీఎస్ ప్లాంటే ప్రధానంగా మారింది. అప్పటి కేటీపీఎస్ ఆడిట్ లెక్కల ప్రకారం హైదరాబాద్‌కు సరఫరా చేసిన విద్యుత్ బిల్లులు ఉద్యోగుల జీతాలు, నిర్వహణ, పెన్షన్‌లకు సరిపోయేవి. అయితే జీవిత కాలం ముగిసిపోవడంతో కేటీపీఎస్ ఏ, బీ, సీ ప్లాంట్లలో విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేసి కూల్చివేత పనులు చేపట్టారు.

కూల్చేందుకు రాజస్థాన్ సంస్థ..

ముందుగా చేసుకున్న ఒప్పందం ప్రకారం బ్లాస్టింగ్ లేకుండా కూలింగ్ టవర్లను కూల్చేయాల్సి ఉంది. కానీ అందుకు ఎక్కువ సమయం పట్టడంతో పాటు అనేక ఇబ్బందులు ఉండటంతో కంట్రోల్డ్ ఇంప్లో షన్ టెక్నిక్ సాయంతో పేలుడు పదార్థాలను అమర్చి క్రమ పద్ధతిలో పేల్చడం ద్వారా కూలింగ్ టవర్లను నేలమట్టం చేయాలని నిర్ణయించారు. రాజస్థాన్‌కు చెందిన ఎక్సిక్యూడ్ సంస్థను ఇందుకు ఎంపిక చేశారు. ఈ సంస్థ గుజరాత్‌లోని సూరత్ దగ్గరున్న 85 మీటర్ల కూలింగ్ టవర్ కూల్చివేత పనులను 2023 మార్చిలో విజయవంతంగా పూర్తి చేసింది. కేటీపీఎస్ టవర్ల కూల్చివేతకు 2,400 కేజీల పేలుడు పదార్థాలు ఉపయోగించినట్టు సమాచారం. వీటిని సరైన రీతిలో అమర్చేందుకు 30 మంది నిపుణులు సుమారు నెలరోజుల పాటు పని చేశారు.

సాంకేతిక అభివృద్ధి

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఎలా అభివృద్ధి చెందింది అనడానికి కేటీపీఎస్ కూలింగ్ టవర్లు మౌన సాక్షులుగా నిలిచాయి. ఆరంభంలో కేవలం 60 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికే భారీ కూలింగ్ టవర్ నిర్మించాల్సి వచ్చింది. ఆ తర్వాత ఒక్కో దశలో విస్తరణ జరుగుతున్న కొద్దీ కూలింగ్ టవర్ కెపాసిటీ పెరుగుతూ వచ్చింది. ప్రస్తుతం ఏడో దశలో 800 మెగావాట్లకు ఒక కూలింగ్ టవర్ సరిపోయింది. ఒకప్పుడు ఎనిమిది కూలింగ్ టవర్లు వాడాల్సిన చోట ఇప్పుడు కేవలం ఒక్క టవర్‌తోనే అంతకంటే ఎక్కువ విద్యుత్ ఉత్పత్తి సాధ్యమైంది.

అందరి దృష్టి ఇటే..

కూలింగ్ టవర్ల కూల్చివేతతో ఒక్కసారిగా అందరి దృష్టి పాల్వంచ వైపు మళ్లింది. దేశంలోనే తొలిసారి ఏకంగా ఎనిమిది ఎత్తయిన కూలింగ్ టవర్లను కూల్చేయడం రీజనల్, నేషనల్ మీడియా దృష్టిని ఆకర్షించింది. చిన్న సంస్థల నుంచి బడా మీడియా సంస్థల వరకు అన్నింటా కూలింగ్ టవర్ల కూల్చివేత అంశానికి మంచి కవరేజ్ లభించింది. మరోవైపు కూల్చివేతకు సంబంధించిన వీడియోలు ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టా, ఎక్స్ వంటి సోషల్ మీడియాల్లోనూ హల్‌చల్ చేశాయి. ఓవైపు బంగ్లాదేశ్ సంక్షోభం, మరోవైపు ఒలంపిక్ క్రీడలు వంటి పాపులర్ టాపిక్స్ మధ్యన కేటీపీఎస్ కూలింగ్ టవర్లకు చోటు దక్కింది.

ఆరు నుంచి ఎనిమిది సెకన్లలో..

కూలింగ్ టవర్ల కూల్చివేత విషయానికి వస్తే దేశంలో ఇప్పటి వరకు పేలుడు ద్వారా కూల్చేసిన కూలింగ్ టవర్లలో గాంధీనగర్ (గుజరాత్) టవర్ ఎత్తు 118 మీటర్లు ఉంది. ఒకేసారి అత్యధిక కూల్చివేతల్లో పానిపట్ (హరియాణా)లో 105 మీటర్లు కలిగిన మూడు కూలింగ్ టవర్లు ఉన్నాయి. వీటిని పది సెకన్ల వ్యవధి తేడాతో కూల్చారు. ఇక కేటీపీఎస్‌లోని బీ, సీ యూనిట్లలో 115 మీటర్లు ఎత్తులో ఉండగా ఒకే రోజు ఎనిమిది కూలింగ్ టవర్లను కూల్చివేశారు. కంట్రోల్డ్ ఇంప్లోషన్ టెక్నిక్ కూల్చివేతల్లో తెలంగాణలో ఇదే మొదటిది. ఇక కేటీపీఎస్ ఏ,బీ, సీ యూనిట్లను స్క్రాప్‌గా అమ్మడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి రూ.485 కోట్ల ఆదాయం వచ్చింది. స్క్రాప్ అమ్మకాల్లోనూ ఇది ఒక రికార్డే.

టవర్లు ఇక జ్ఞాపకాల్లోనే.. 8లో

'పెదవాగు'పై ప్రతిపాదనలు పంపండి

ఇరు రాష్ట్రాల అధికారులతో ముకేశ్ సిన్హా చర్చ

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఇటీవల ఆకస్మిక వరదలకు కొట్టుకుపోయిన పెద్దవాగు ప్రాజెక్టుపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ అధికారుల మధ్య సోమవారం చర్చ జరిగింది. గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు చైర్మన్ ముకేశ్‌సిన్హా ఇరు రాష్ట్రాల అధికారులతో హైదరాబాద్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దవాగు ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితి, మరమ్మతులు, ఆధునీకీకరణపై చర్చించారు. ఇంతకు ముందు ఈ అంశంపై 2018లో చర్చ జరగగా అప్పుడు ప్రాజెక్టు ఆధునీకీకరణకు రూ.78 కోట్లు ఖర్చవుతాయని నిర్ధారించారు. ఇందులో 85 శాతం ఏపీ ప్రభుత్వం భరించాలని, మిగిలిన 15 శాతం తెలంగాణ ఖర్చు పెట్టాలని నిర్ణయించారు. అయితే ఆ తర్వాత కాలంలో ఈ అంశంపై సానుకూల పురోగతి రాలేదు. కాగా ప్రస్తుతం రెండు రాష్ట్రాల వాటాలను అలానే ఉంచి కొత్త ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని ఇరు రాష్ట్రాల అధికారులను సిన్హా ఆదేశించారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు మరమ్మతులు, ఆధునీకీకరణకు రూ.120 కోట్లు ఖర్చవుతుందని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ఈ సమావేశంలో తెలంగాణ తరపున భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జలవనరుల శాఖ ఎస్ఈ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

పరిశోధనలపై దృష్టి పెట్టాలి



మాట్లాడుతున్న చలపతిరాజు

భద్రాచలంటౌన్: విద్యార్థులకు పాఠశాల స్థాయిలోనే సామాజిక సమస్యలపై అవగాహన కల్పిస్తే పరిశోధల పట్ల ఆసక్తి చూపుతారని జిల్లా సైన్స్ అధికారి ఎస్.చలపతిరాజు అన్నారు. భద్రాచలంలోని సెయింట్ పాల్స్ ఉన్నత పాఠశాలలో భద్రాచలం, మణుగూరు డివిజన్ల పరిధిలోని సైన్స్, గణితం ఉపాధ్యాయులకు ఇన్‌స్పైర్ మనాక్ పథకంపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చలపతిరాజు మాట్లాడుతూ.. జిల్లాలో ఈ ఏడాది రెండు వేల ప్రాజెక్టులు అప్‌లోడ్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఎంపికైన ఒక్కో ప్రాజెక్టుకు రూ.10 వేలు లభిస్తాయని తెలిపారు. జాతీయ స్థాయిలో ఎంపికైన విద్యార్థులకు ఐఐటీ అడ్మిషన్లలో రెండు శాతం రిజర్వేషన్లు ఉంటాయన్నారు. గతేడాది జిల్లా నుంచి మూడు ప్రాజెక్టులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాయని తెలిపారు. అనంతరం పవర్ పాయింట్ ప్రాజెక్టు ద్వారా ఇన్‌స్పైర్ రిజిస్ట్రేషన్, ఉపయోగాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్‌సీ కో ఆర్డినేటర్ సంపత్‌కుమార్, అబ్రహం, చంద్రశేఖర్, కోటేశ్వరరావు, ఏజే ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛదనం.. పచ్చదనం అందరి బాధ్యత



రామవరంలో పిచ్చిమొక్కలను తొలగిస్తున్న కలెక్టర్ జితేష్, మున్సిపల్ చైర్‌పర్సన్ సీతాలక్ష్మి



టేకులపల్లి మండలం రాంపురంలో రైతుతో మాట్లాడుతున్న కలెక్టర్

కలెక్టర్ జితేష్ వి పాటిల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): స్వచ్ఛదనం, పచ్చదనం అందరి బాధ్యత అని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కొత్తగూడెం మున్సిపాలిటి పరిధిలోని రామవరంలో సోమవారం ఆయన స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పరిశుభ్రతపై అవగాహన కోసమే ప్రజల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి పిలుపు మేరకు శ్రమదానంలో భాగస్వాములైన వార్డు ప్రజలను కలెక్టర్ అభినందించారు. కలెక్టర్‌కు స్థానిక అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు లెమన్‌గ్రాస్ మొక్క అందజేయగా.. ప్రతి అంగన్‌వాడీ సెంటర్‌లో పిల్లలకు ఉపయోగపడే ఔషధ మొక్కలను పెంచాలని కలెక్టర్ సూచించారు. అనంతరం కలెక్టర్‌తో పాటు మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, కమిషనర్ శేషాంజన్‌స్వామి, ప్రత్యేకాధికారి అర్జున్, సింగరేణి ఆస్పత్రి ఏజీఎం రామకృష్ణ తదితరులు శ్రమదానం చేశారు. ఖాళీ ప్రదేశంలో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించారు. శుభ్రం చేసిన ఖాళీ ప్రదేశంలో గతంలో గ్రంథాలయం ఉండేదని, ఆ తర్వాత పిచ్చిమొక్కలు పెరిగాయని చైర్‌పర్సన్ సీతాలక్ష్మి కలెక్టర్ దృష్టికి తేగా సింగరేణి యాజమాన్యంతో మాట్లాడి లైబ్రరీ లేదా అంగన్‌వాడీ కేంద్రం నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ రవిబాబు, డీఈ రవికుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్ చౌహాన్, ఐటీసీ వావ్ ప్రతినిధి పి.రవి, టూటౌన్ సీఐ రమేష్, సింగరేణి సూపర్‌వైజర్ మర్రి శ్రీనివాస్, మున్సిపల్ జవాన్ రాజేష్, మున్సిపల్, సింగరేణి కార్మికులు పాల్గొన్నారు.

ప్రతి ఇంట్లో ఔషధ మొక్కలు నాటాలి

టేకులపల్లి: ప్రతి ఒక్కరూ స్వచ్ఛదనం–పచ్చదనం అలవాటు చేసుకుని ఆరోగ్యకరమైన జీవితం గడపాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. టేకులపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఇంట్లో ఔషధ మొక్కలైన మునగ, కరివేపాకు, చింత, జామ, తులసి వంటివి నాటాలని సూచించారు. తడి, పొడి చెత్తను వేరు చేసి డబ్బాలో నిల్వ చేసి అమ్మడం ద్వారా ఆదాయం గడించవచ్చని తెలిపారు. తడి చెత్తను ఎరువుగా మొక్కలకు వేస్తే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. అనంతరం టేకులపల్లి మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శానిటరీ న్యాప్‌కిన్స్ తయారీ కేంద్రాన్ని సందర్శించారు. అన్ని మండలాల మహిళా శక్తి కేంద్రాల్లో శానిటరీ న్యాప్‌కిన్లు లభించేలా మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామని అన్నారు. ఆ తర్వాత సులానగర్ నర్సరీలో మొక్కలను పరిశీలించారు. అదనపు కలెక్టర్ విద్యాచందన, తహసీల్దార్ నాగభవాని, ఎంపీపీ బాణోత్ ప్రియాంక, ఎంపీడీఓ రవీంద్రరావు, ఉద్యోగులు గణేష్ గాంధీ, అన్నపూర్ణ, శ్రీనివాస్, రవికుమార్, తిరుపతి, శ్రావణి పాల్గొన్నారు.

జిల్లాలో 14,891 మంది శ్రమదానం

చుంచుపల్లి: జిల్లాలో చేపట్టిన స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమం సోమవారం ఉద్యమంలా కొనసాగింది. జిల్లాలోని 481 గ్రామపంచాయతీలు, నాలుగు మున్సిపాలిటీల పరిధిలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించగా మొత్తం 14,891 మంది శ్రమదానం చేశారు. తొలిరోజు ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆర్టీసీ బస్టాండ్లు, హెల్త్ సెంటర్లలో విస్తృతంగా పారిశుద్ధ్య కార్యక్రమాలతో పాటు అన్ని ప్రాంతాల్లో ర్యాలీలు నిర్వహించారు. వీధుల వెంట ఉన్న చెత్తను తొలగించారు. అవగాహన సమావేశాలు ఏర్పాటుచేశారు. విద్యార్థులకు పారిశుద్ధ్యంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కలెక్టర్ జితేష్ వి.పాటిల్ రామవరంలో, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు లక్ష్మీదేవిపల్లి మండలం శ్రీనగర్ కాలనీలో నిర్వహించిన కార్యక్రమాలకు హాజరు కాగా, జూలూరుపాడులో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, చుంచుపల్లిలో డీపీఓ చంద్రమౌళి పాల్గొన్నారు.

సాగుభూములకు 'సీతారామ'

- ఈనెల 15న జిల్లాకు సీఎం రేవంత్‌రెడ్డి
- ప్రాజెక్టు పంప్‌హౌస్‌ల్లో మోటార్లు ఆన్ చేయనున్న సీఎం
- ఆపై వైరాలో రైతు సదస్సుకు హాజరు
- ఏర్పాట్లను పరిశీలించిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల



ఏర్పాట్లపై ట్యాబ్ ద్వారా వివరిస్తున్న మంత్రి

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈనెల 15న ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నారు. భద్రాద్రి జిల్లాలో సీతారామ ప్రాజెక్టు పంప్‌హౌస్‌ల్లో మోటార్లను ప్రారంభించడంతో పాటు వైరాలో జరిగే రైతు సదస్సులో ప్రసంగిస్తారు. అలాగే, మూడో విడతగా రూ.లక్షన్నర నుంచి రూ.2 లక్షల లోపు రుణమాఫీకి సీఎం ఇక్కడి నుంచే శ్రీకారం చుట్టి కొందరు రైతులకు చెక్కులు అందిస్తారు. ఈమేరకు స్వాతంత్ర్య దినోత్సవం రోజున సీఎం రేవంత్‌రెడ్డి ఉమ్మడి జిల్లా పర్యటన ఖరారైందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు 'సాక్షి'కి తెలిపారు.

సీతారామ నీరు విడుదల..

ఉమ్మడి జిల్లాను సస్యశ్యామలం చేయాలనే లక్ష్యంతో నిర్మిస్తున్న సీతారామ ప్రాజెక్టుపై జిల్లా మంత్రులతోపాటు ప్రభుత్వం దృష్టి సారించింది. పెండింగ్ పనులు పూర్తిచేసేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ కావాల్సిన నిధులను విడుదల చేస్తున్నారు. డిప్యూటీ సీఎం భట్టి సహా మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి పలు మార్లు పనులను పరిశీలించారు. మూడు పంపుహౌస్‌ల్లో అమర్చిన మోటార్లు చైనాకు చెందిన షాంగై ఎలక్ట్రికల్ కంపెనీకి చెందినవి కావడంతో అక్కడి ఇంజనీర్లను రప్పించడంతో ప్రస్తుతం పనులు చకచకా సాగుతున్నాయి. ఇప్పటికే పలు పంప్‌హౌస్‌ల్లో మోటార్ల ట్రయల్ రన్ కూడా చేపట్టార.

ఒకేసారి గోదావరి, కృష్ణమ్మ నీరు..

సీతారామ ద్వారా ఉమ్మడి జిల్లాలో సాగు అవసరాలకు గోదావరి జలాలను విడుదల చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా ఈనెల 15న పంప్‌హౌస్‌లను సీఎం ప్రారంభిస్తారు. కమలాపురం, పూసుగూడెంలో ఏదైనా ఒక చోట సీఎం స్విచాన్ చేస్తారు. ఇక్కడి నుంచి జలాలు వైరా, సత్తుపల్లి, అశ్వారావుపేట, పినపాక, మధిర నియోజకవర్గాలకు అందనున్నాయి. ఇక నాగార్జున సాగర్ ప్రాజెక్టు నుంచి ఎడమకాల్వకు నీటిని విడుదల చేశారు. ఈ నీరు కూడా ఉమ్మడి జిల్లాకు చేరుతోంది. దీంతో ఒకేసారి గోదావరి, కృష్ణ జలాలు జిల్లాలో సాగు అవసరాలకు అందుతాయి. కాగా రైతు సంక్షేమం, వ్యవసాయాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని,, ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేస్తున్నామనే సంకేతాన్ని ఇచ్చేలా కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఈవిషయాన్ని చాటేలా ఉమ్మడి ఖమ్మం జిల్లాను ఎంచుకుంది. ఇందులో భాగంగా సీతారామ ప్రాజెక్టు నుంచి నీటి విడుదలతోపాటు వైరాలో రైతు సదస్సును నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

సమన్వయంతో పని చేయాలి

- వైద్యవిధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్
- కొత్తగూడెం, భద్రాచలం ఆస్పత్రుల పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..



భద్రాచలం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారిని పరిశీలిస్తున్న అజయ్‌కుమార్

కొత్తగూడెంరూరల్/భద్రాచలం అర్బన్ : వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధులపై డీఎంహెచ్‌ఓ, వైద్యారోగ్య శాఖ అధికారులు సమన్వయంగా వ్యవహరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్ అన్నారు. 'సాక్షి' ప్రధాన సంచికలో ఆదివారం ప్రచురితమైన 'నాడి పట్టేదెవరు' కథనానికి స్పందించిన వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాల మేరకు సోమవారం అజయ్‌కుమార్ జిల్లాకు వచ్చి కొత్తగూడెం, భద్రాచలం ఆస్పత్రులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వైద్యారోగ్య శాఖ సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యంగా ఉండవద్దన్నారు. జిల్లాలో వైద్యులు, ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్ల కొరతపై నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. జిల్లా సర్వజన ఆస్పత్రిలో మందులు, సిబ్బంది కొరతపై ఏఓలు విజయభాస్కర్, రవికుమార్, ఫార్మసిస్ట్ రాజ్యలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. వైద్య విధాన పరిషత్ నుంచి కొత్తగూడెం ఎంసీహెచ్‌కు గైనాకాలజిస్ట్ సరళను నియమించామని, ఆమెను భద్రాచలం ఆస్పత్రికి కేటాయించాలని ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ రాధామోహన్‌కు సూచించారు. అనంతరం కలెక్టర్‌తో సమావేశమై పలు విషయాలు చర్చించారు. ఆ తర్వాత భద్రాచలంలో విలేకరులతో మాట్లాడుతూ.. స్థానిక ఏరియా ఆస్పత్రిలో వైద్యుల భర్తీకి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అయితే ఏజెన్సీ ప్రాంతంలో పని చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదని అన్నారు. ఆస్పత్రిలో చేరుతున్న రోగుల సంఖ్య, సరిపడా మందులు ఉన్నాయా, బాధితులకు ఎలాంటి వైద్యం అందుతోంది వంటి వివరాలను నిత్యం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తెలుసుకుంటున్నామని చెప్పారు. వైద్యుల కొరత కారణంగానే కొంత ఇబ్బంది కలుగుతోందన్నారు. డాక్టర్లు, సిబ్బంది సమయపాలన పాటించకపోయినా, నిర్లక్ష్యంగా వ్యవహరించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. శానిటేషన్ సిబ్బందికి వేతనాలు సక్రమంగా రావడం లేదని తెలిసిందని, కాంట్రాక్టర్‌తో మాట్లాడి వారి సమస్యలు పరిష్కరించాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ రామకృష్ణను ఆదేశించారు. అనంతరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, వారికి అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త డాక్టర్ రవిబాబు, వైద్యులు క్రాపా విజయ్, సంతోష్, జగదీష్, ఏరియా ఆసుపత్రి నర్సింగ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. అనంతరం శ్రీసీతారామచంద్రస్వామి వారిని అజయ్‌కుమార్ దర్శించుకున్నారు.

టవర్లు ఇక జ్ఞాపకాల్లోనే..

- ప్రశాంతంగా కూలింగ్ టవర్ల కూల్చివేత
- కేటీపీఎస్‌లో నాడు 12 టవర్లు.. ఇక నుంచి నాలుగే
- కూల్చివేతను ఆసక్తిగా తిలకించిన పాల్వంచ వాసులు
- గుర్తులు చెదిరిపోతుండటంతో సెల్‌ఫోన్లలో చిత్రీకరణ





కూలింగ్ టవర్లు కూల్చిన తర్వాత కర్మాగారం ప్రాంతం, (ఇన్‌సెట్) కూలింగ్ టవర్లు కూల్చక ముందు..

పాల్వంచ: పాల్వంచలోని కేటీపీఎస్ కర్మాగారంలో ఓఅండ్‌ఎం (పాత ప్లాంట్) శకం ముగిసింది. కర్మాగారంలోని అన్ని విభాగాలతో పాటు కూలింగ్ టవర్లు సైతం కనుమరుగయ్యాయి. ఓఅండ్‌ఎం కర్మాగారంలో ఎనిమిది యూనిట్లకు గాను ఎనిమిది కూలింగ్ టవర్లు, 5, 6వ దశల్లో 9, 10, 11 యూనిట్లకు గాను మూడు, 7వ దశకు సంబంధించి 12వ యూనిట్‌లో ఒక కూలింగ్ టవర్ పట్టణానికి ఐకాన్‌గా నిలిచేవి. ఇందులో ఓఅండ్‌ఎం కర్మాగారం కాలం చెల్లడంతో ఇప్పటికే ఇతర నిర్మాణాలను తుక్కుగా మార్చిన నేపథ్యాన సోమవారం ఏకకాలంలో ఎనిమిది టవర్లను నేలమట్టం చేశారు. దీంతో పాల్వంచకు ఒక గుర్తులు నిలిచే టవర్లులేక బోసిపోయినట్లుగా మారిందని స్థానికులు చెబుతున్నారు.

పాల్వంచకు ఐకాన్..

పాల్వంచ అంటే మొదట గుర్తొచ్చేది కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ (కేటీపీఎస్). ఆపై ఈ కూలింగ్ టవర్లేనని చెప్పాలి. చుట్టూ కొన్ని మైళ్ల దూరం వరకు ఈ టవర్లు కనిపిస్తుంటాయి. 1965–78 సంవత్సరంలో కేటీపీఎస్ ఓఅండ్‌ఎం కర్మాగారాన్ని నిర్మించారు. ఇందులో ఏ–స్టేషన్‌లో 60 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 1, 2, 3, 4యూనిట్లు ఉంటాయి. తొలుత 'ఏ' స్టేషన్‌ను జపాన్ టెక్నాలజీతో నిర్మించారు. ఆపై బీ, సీ స్టేషన్లలో 120 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 5, 6, 7, 8 యూనిట్లను స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించగా రాష్ట్రానికి వెలుగులు పంచాయి. కాగా, ఒక్కో స్టేషన్‌కు ఒక్కో కూలింగ్ టవర్ చొప్పున ఎనిమిది నిర్మాణాలు ఉన్నాయి. విద్యుత్ ఉత్పత్తి చేసే క్రమాన నీరు, బొగ్గు మండించినప్పుడు వచ్చే వేడిని తగ్గించేందుకు ఈ టవర్లు ఉపయోగపడుతాయి. ఎంతో నాణ్యతగా నిర్మించిన టవర్లు కావడంతో ఇప్పటికీ చెక్కుచెదరక పోవడం గమనార్హం.

కొంత సేపు ట్రాఫిక్ ఆంక్షలు

కూలింగ్ టవర్ల కూల్చివేత సమయాన వాహనాలు, ప్రజల రాకపోకలకు కొద్దిసేపు అంతరాయం ఏర్పడింది. కర్మాగారం చీఫ్ ఇంజనీర్ పి.వెంకటేశ్వరరావు అధికారులతో కలిసి టవర్ల కూల్చివేతను పర్యవేక్షించారు. పాల్వంచ డీఎస్పీ సతీశ్‌కుమార్, సీఐ వినయ్‌కుమార్, ఎస్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ ఎ.అప్పాజీ, ఇన్‌స్పెక్టర్ కిరణ్, జెన్‌కో విజిలెన్స్ డీఎస్పీ రమేశ్, ఎస్‌ఈ కిరణ్‌కుమార్ ఆధ్వర్యాన బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉదయం కరకవాగు, అల్లూరిసెంటర్, పాండురంగాపురం రోడ్లలో ఎవరూ తిరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అటుగా తిరిగే వాహనాలను నిలిపివేశారు. కూల్చివేత పూర్తయ్యాక సీఈ పి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ఎలాంటి సమస్య రాకుండా పనులను పూర్తిచేసిన హెచ్‌ఆర్, ఎక్సిక్యూడ్, కేటీపీఎస్ అధికారులు, సిబ్బందిని అభినందించారు. కాగా, కూలింగ్ టవర్ల కూల్చివేత దృశ్యాలను కేటీపీఎస్ ఉద్యోగ, కార్మికులు సెల్‌ఫోన్లలో బంధించేందుకు ఆసక్తి చూపారు. అనంతరం ఈ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి.

స్టేషన్ల వారీగా కూలింగ్ టవర్లు, వాటి వివరాలు			మీటర్లలో...			
			భూమట్టం	మధ్యలో	టాప్ లెవల్	ఎత్తు
స్టేషన్	యూనిట్లు	టవర్లు	విస్తీర్ణం	విస్తీర్ణం	విస్తీర్ణం	
ఏ	1 - 4	4	70	36.55	42.00	102
బీ	5 - 6	2	92.31	55.10	61.64	115
సీ	7 - 8	2	92.31	55.10	61.64	115

పూర్వవైభవానికి కృషిచేయాలి



ఓఅండ్‌ఎం కర్మాగారాన్ని విదేశీ పరిజ్ఞానంతో నిర్మించగా దేశ, విదేశాల వారు ఇక్కడకు వచ్చి అధ్యయనం చేసేవారు. ఇప్పుడు పాల్వంచ అభివృద్ధిలో వెనుకబడింది. ప్రస్తుత ప్రభుత్వమైనా స్పందించి పాల్వంచ పూర్వవైభవానికి కృషి చేయాలి.
–చలవాది ప్రకాష్, వర్తక సంఘం కన్వీనర్

టవర్లు కళ్లముందే కదలాడేవి



కూలింగ్ టవర్లను చిన్నతనం చూస్తూ పెరిగాం. ఇప్పుడు వాటిని కూల్చివేయడంతో ఏదో కోల్పోయామనే భావన వచ్చింది. ఇక్కడ కొత్త కర్మాగారం నెలకొల్పాలి. ఇతర ప్రాంతాలకు వెళ్లిన ఉద్యోగులను మళ్లీ రప్పిస్తే పాల్వంచకు కొత్త కళ వస్తుంది.
–నల్లా సురేశ్‌రెడ్డి, రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు

కూల్చేస్తుంటే కన్నీళ్లు పెట్టుకున్నాం



పాత ప్లాంట్ నిర్మాణానికి ఏళ్లు పడితే క్షణాల్లో టవర్లు కూలిపోతుండడం చూసి నాలాంటి రిటైర్డ్ ఉద్యోగులు కంటతడి పెట్టారు. ప్లాంట్‌ను కూల్చివేయొద్దని కోరినా పట్టించుకోలేదు. ఇక్కడ మరో రెండు 800 మెగావాట్ల కర్మాగారాలు నిర్మించాలి.
–ఎంఏ వజీర్, రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు

బాధగా ఉంది..



ఓఅండ్‌ఎం కర్మాగారం ఉందని ఉపాధి కోసం వచ్చాం. 1,200 మందికి ఒకేసారి పర్మనెంట్ కావడంతో మా జీవితాల్లో వెలుగులు నిండాయి. ఇన్నాళ్లు కనిపించే కర్మాగారం కూలిపోవడం బాధగా ఉంది. మరో స్టేషన్ నిర్మాణంపై పాలకులు దృష్టి సారించాలి.
–సీహెచ్ రమేశ్, టీఆర్‌వీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



టవర్లు కూల్చివేతలో పాల్గొన్న ఎక్సిక్యూడ్ డైరెక్టర్ ఆనంద్‌శర్మతో కేటీపీఎస్, హెచ్‌ఆర్ సంస్థ ప్రతినిధులు

సైడ్‌లైట్స్

- కూలింగ్ టవర్లు కూల్చేస్తున్నారనే సమాచారంతో ఉదయం 8 గంటల నుంచి పలువురు దాబాలపైకి వెళ్లి కూర్చున్నారు.
- ఉదయం 8.20 గంటలకు 'ఏ' స్టేషన్‌లోని నాలుగు టవర్లు ఒక్కసారిగా పేల్చివేశారు.
- 'బీ' స్టేషన్‌లో రెండు కూలింగ్ టవర్లు పేల్చివేత వెంటనే జరుగుతుందని భావించినా 10 నుంచి 12 గంటల వరకు వేచి చూడాల్సి వచ్చింది.
- ఆ తర్వాత 220 కేవీ విద్యుత్ లైన్ల క్లియరెన్స్ ట్రాన్స్‌కో నుంచి రావడం ఆలస్యమవడంతో 'సీ' స్టేషన్ రెండు టవర్లను 11.40 గంటలకు కూల్చివేశారు.
- ప్రతీ కూలింగ్ టవర్ నేలమట్టం కావడానికి 6 సెకన్ల నుంచి 8 సెకన్లు మాత్రమే పట్టింది.
- బీ, సీ స్టేషన్ల కూలింగ్ టవర్లు 5, 6వ దశల కర్మాగారానికి చేరువలో ఉండటంతో ఇంజనీర్లు, ఉద్యోగులు బాయిలర్లు, అడ్మిన్ బ్లాక్‌లపైకి వెళ్లి వీక్షించారు. అయితే, దుమ్ము, ధూళి వెలువడటంతో దూరంగా వెళ్లిపోయారు.
- కూలింగ్ టవర్లు కొన్ని కరకవాగు వైపు ఉండగా ఆ రహదారిలో రాకపోకలు నిలిపేశారు.



సీఈ కార్యాలయం పైనుంచి వీక్షిస్తున్న ఉద్యోగులు, స్థానికులు

క్లుప్తంగా

అటవీశాఖ అధికారుల విచారణ

ములకలపల్లి: మండలంలోని గండిపోలు గ్రామశివారులోని గిరిజన రైతుల పట్టాభూముల్లో టేకు చెట్ల తొలగింపుపై అటవీశాఖ అధికారులు విచారణ నిర్వహించారు. స్థానిక రైతులు భూ అభివృద్ధి నిమిత్తం సరిహద్దుల్లోని టేకు చెట్లను జేసీబీతో కూకటివేళ్లతో సహా తొలగించిన విషయం విదితమే. ఈ క్రమంలో సోమవారం జగన్నాథపురం ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ (ఎఫ్‌ఎస్‌ఓ) సతీశ్ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో పర్యటించి, సమగ్ర వివరాలు సేకరించారు. నేలవాలిన టేకు చెట్ల కొలతలను తీసుకున్నారు. కూల్చివేతకు వినియోగించిన వాహనం సైతం అక్కడే ఉన్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా ఎఫ్‌ఎస్‌ఓ మాట్లాడుతూ.. విచారణ నిర్వహిస్తున్నామని, ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తామని తెలిపారు.

బడికి తాళం వేసి ధర్నా..



పాఠశాలకు తాళం వేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

అశ్వాపురం: మండలంలోని కుర్నాపల్లి కొత్తూరులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు సోమవారం పాఠశాలకు తాళం వేసి గేటు ఎదుట ధర్నా చేపట్టారు. పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు 48 మంది విద్యార్థులు ఉండగా ఒక్కరే ఉపాధ్యాయుడు ఉన్నాడు. ఉపాధ్యాయులు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, చదువులో వెనుకబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి తక్షణమే ఉపాధ్యాయులను నియమించాలని వారు కోరారు.

వ్యక్తి మృతిపై కేసు

జూలూరుపాడు: మద్యం సేవించి అన్నపానీయాలు తీసుకోకపోవడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటనపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఏఎస్‌ఐ కోటేశ్వరరావు కథనం ప్రకారం.. వినోభానగర్‌కు చెందిన ట్రాక్టర్‌డ్రైవర్ గుగులోత్ రమేశ్ (39) మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం రమేశ్ పనికి వెళ్లి వచ్చి మద్యం తాగి అన్నం, నీళ్లు తీసుకోకుండా పడుకున్నాడు. భార్య ఝాన్సీ పొలం పనులకు వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చేసరికి రమేశ్ అపస్మారకస్థితిలో ఉండగా కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ అదే రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ కోటేశ్వరరావు వెల్లడించారు.

గృహహింసపై..

ఇల్లెందురూరల్: వేధింపులకు గురిచేసిన భర్త, అత్తమామలపై సోమవారం కేసు నమోదైంది. మండలంలోని మర్రిగూడేనికి చెందిన ఇర్ప లత, తొర్రూరు మండలం కొత్తగూడేనికి చెందిన రాంబాబు ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ఆరు నెలలకే భర్త, అతని తల్లిదండ్రులు వరకట్నం కావాలని వేధించడంతో లత పోలీసులకు ఫిర్యాదు చేసింది. విచారణ అనంతరం రాంబాబు, అతని తల్లిదండ్రులపై గృహ హింస కేసు నమోదు చేసినట్లు కొమరారం ఎస్‌ఐ సోమేశ్వర్ వెల్లడించారు.

గంజాయి స్వాధీనం

అశ్వాపురం: మండల కేంద్రంలోని చవిటిగూడెంలో ఓ ఇంట్లో కేజీ గంజాయిని అశ్వాపురం పోలీసులు సోమవారం పట్టుకున్నారు. సీఐ అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో చవిటిగూడెంలో పోలీసులు డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. పార్వతమ్మ ఇంట్లోని వంట గదిలో గిన్నెల కింద దాచిపెట్టిన కేజీ గంజాయిని జాగిలం పట్టించింది. పోలీసులు దానిని స్వాధీనం చేసుకొని మహిళను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

భద్రాచలంలో 4.50 కిలోలు...

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని కూనవరంరోడ్‌లో సోమవారం పట్టణ పోలీసులు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ విజయలక్ష్మి కథనం ప్రకారం.. కూనవరంరోడ్‌లో వాహనాలు తనిఖీ చేస్తున్న సందర్భంలో ద్విచక్రవాహనంపై వస్తున్న యువకుడిని ఆపి తనిఖీ చేయగా గంజాయి దొరికింది. అతడిని ఏపీలోని కుక్కునూరు మండలానికి చెందిన సీతారామనగరం గ్రామానికి చెందిన ఆవుల రాజేశ్‌గా గుర్తించారు. పట్టుబడిన గంజాయిని మల్కనగిరి నుంచి తీసుకొస్తున్నట్లు నిందితుడు అంగీకరించాడు. పట్టుబడిన గంజాయి 4.50 కిలోలు ఉందని ఎస్‌ఐ తెలిపారు.

గంజాయి వదిలి పరార్

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఆర్టీసీ బస్టాండ్ నుంచి సోమవారం రాత్రి హైదరాబాద్ వెళ్తున్న లహరి బస్సులో అక్రమంగా గంజాయి తరలించేందుకు ప్రయత్నిస్తుండగా కండక్టర్ గుర్తించడంతో ఆగంతకుడు బ్యాగ్ వదిలేసి పరారయ్యాడు. బస్సు ఎక్కిన వ్యక్తి అనుమానాస్పదంగా ఉండడడంతో కండక్టర్ వివరాలు ఆరా తీస్తుండగానే పారిపోయాడు. ఆపై సిబ్బంది ఆ బ్యాగ్‌లో పరిశీలించగా గంజాయి లభించింది. దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వగా సీసీ కెమెరాల ఫుటేజీ పరిశీలిస్తున్నారు.

పూసుగుప్పలో వెలిసిన మావోయిస్టుల బ్యానర్లు

చర్ల: మండంలోని పూసుగుప్ప అటవీ ప్రాంతంలో సోమవారం మావోయిస్టుల బ్యానర్లు వెలిశాయి. మావోయిస్టు పార్టీ చర్ల శబరి ఏరియా కమిటీ పేరిట వెలిసిన ఈ బ్యానర్లలో వారోత్సవాలు నిర్వహించాలని మావోయిస్టులు కోరారు. అయితే వారోత్సవాలు ముగిసిన రెండు రోజుల తరువాత ఇవి వెలియడం చర్చనీయాంశమైంది.

ప్రతి మొక్కనూ సంరక్షించాలి

స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్



సుజాతనగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు



గిరిజన గురుకుల పాఠశాలలో పిచ్చిమొక్కలు తొలగిస్తున్న అదనపు కలెక్టర్ విద్యాచందన

సుజాతనగర్/జూలూరుపాడు: నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ అన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాల్లో భాగంగా సోమవారం సుజాతనగర్ ఎంపీడీఓ కార్యాలయం నుంచి హైస్కూల్ వరకు ర్యాలీ చేపట్టారు. హైస్కూల్‌లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయం నుంచి గ్రామ పంచాయతీ కార్యాలయం వరకు శ్రమదానం నిర్వహించి రహదారికి ఇరువైపులా ఉన్న చెత్తచెదారం, పిచ్చి మొక్కలను తొలగించారు. ఆ తర్వాత పాపకొల్లు, జూలూరుపాడు గ్రామ పంచాయతీల్లో పర్యటించి, పారిశుధ్య పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాలు పరిశుభ్రత, పచ్చదనంతో కనిపించాలన్నారు. దోమలు విజృంభించకుండా మురికి, నీటిగుంతలు పూడ్చడం డ్రెయినేజీల్లోని పూడిక తీయించడంతోపాటు, బ్లీచింగ్ చల్లించాలని, ఫాగింగ్ చేయాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీఓ భారతి, ఎంపీఓలు బి.శ్రీనివాసరావు, టి.తులసీరామ్, ఏపీఓ చందర్, పాపకొల్లు, జూలూరుపాడు పంచాయతీ కార్యదర్శులు అశోక్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు పెంచడం బాధ్యతగా భావించాలి

ఇల్లెందురూరల్: మొక్కలు పెంచడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని అదనపు కలెక్టర్, డీఆర్‌డీఓ విద్యాచందన సూచించారు. మండలంలోని సుభాష్‌నగర్ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో సోమవారం స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమాన్ని ప్రారంభించారు. గురుకులంలో పిచ్చి మొక్కలు తొలగించారు. అనంతరం భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ, వాతావరణ సమతుల్యతను కాపాడటమే లక్ష్యంగా పచ్చదనం పెంపునకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి సూర్యనారాయణ, ఎంపీడీఓ ధన్‌సింగ్, ఎంపీఓ చిరంజీవి, ఏపీఎం దుర్గారావు, సుభాష్, ఏపీఓ శంకర్, కార్యదర్శి రజినీకాంత్, గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ రత్నకుమారి, హెచ్‌ఎం మాధురి తదితరులు పాల్గొన్నారు.

కళాశాల బస్సు అద్దం ధ్వంసం

అశ్వారావుపేటరూరల్: మండలంలోని తిరుమలకుంట గ్రామంలో పార్కింగ్ చేసి ఉన్న ఓ ప్రైవేట్ కళాశాల బస్సు అద్దాలను గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేసిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. సత్తుపల్లికి చెందిన ఓ ప్రైవేట్ కళాశాల బస్సు రోజూ తిరుమలకుంట వరకు నడుపుతోంది. కళాశాల నుంచి విద్యార్థులను తీసుకొచ్చిన తర్వాత గ్రామంలో ఉన్న ఖాళీ స్థలం వద్ద పార్కింగ్ చేస్తుంటారు. ఈ క్రమంలోనే శనివారం సాయంత్రం పార్కింగ్ చేసి ఉన్న బస్సు ముందు భాగం అద్దాలను గుర్తు తెలియని వ్యక్తులు రాళ్లతో దాడి చేసి ధ్వంసం చేశారు. కాగా, గ్రామంలో ఉన్న సీసీ కెమెరాలు పని చేయకపోవడంతో కొద్ది రోజులుగా గుర్తు తెలియని దుండగులు, ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు.

వివాహిత ఆత్మహత్య

భద్రాచలంఅర్బన్: గోదావరి బ్రిడ్జి పైనుంచి దూకి ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. సారపాక పట్టణ పరిధి గాంధీనగర్‌కు చెందిన భూక్యా శైలజ తన భర్త గణేశ్‌తో సోమవారం ఉదయం గొడవపడి ఇంట్లో నుంచి బయటకు వచ్చింది. పాత బ్రిడ్జి పైనుంచి గోదావరిలోకి దూకి ఆత్మహత్య చేసుకుంది. కాగా, స్థానిక గజ ఈతగాళ్లు, జాలర్లు కొద్దిసేపు గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ శైలజ ఆచూకీ లభ్యం కాలేదు.

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

ఐటీడీఏ పీఓ రాహుల్



మాట్లాడుతున్న పీఓ రాహుల్

భద్రాచలం: గిరిజన దర్బార్‌లో సమర్పించిన దరఖాస్తులను పరిశీలించి అర్హతల మేరకు వాటిని సత్వరమే పరిష్కరించాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ అన్నారు. సోమవారం ఐటీడీఏ సమావేశపు మందిరంలో జరిగిన గిరిజన దర్బార్‌లో ఆయన పాల్గొని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనుల వద్ద నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. వాటిని సంబంధిత యూనిట్ అధికారులకు అందచేసి మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు గిరిజనుల చెంతకు చేరే విధంగా అందరూ సమష్టిగా పనిచేయాలని, గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో విద్యాబోధన సక్రమంగా జరిగేలా స్పెషల్ ఆఫీసర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో అధికారులు మణెమ్మ, తానాజీ, నాగార్జున్‌రావు, రవీంద్రనాథ్, మునీర్‌పాషా, శ్రీనివాస్, ఉదయ్, భాస్కర్, నరేశ్, ఆదినారాయణ, నారాయణరావు, హరికృష్ణ, లింగానాయక్ తదితరులు పాల్గొన్నారు. కాగా, కారు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన దమ్మపేట మండలం కొడిశెలగూడెంనకు చెందిన పెనుబల్లి సతీశ్‌కుమార్‌కు ఐటీడీఏ రిలీఫ్ ఫండ్ నుంచి పీఓ రాహుల్ ఆర్థిక సాయం అందించారు.

పండుగలా జరుపుదాం..

ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పండుగలా జరపుదామని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ అన్నారు. సోమవారం పీఓ తన చాంబర్‌లో ఐటీడీఏ అధికారులు, గిరిజన ఆదివాసీ జేఏసీ సభ్యులతో ఈ నెల 9న జరిగే ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ముందస్తు ఏర్పాట్లపై ఆయన సమీక్షించారు. కార్యక్రమంపై విస్తృతంగా ప్రచారం చేయాలని, ర్యాలీలు, ఇతర కార్యక్రమాల్లో గిరిజనులు పెద్ద ఎత్తున పాల్గొనే విధంగా చూడాలని తెలిపారు. సమావేశంలో డేవిడ్‌రాజ్, రమణయ్య, ఆదినారాయణ, శ్రీనివాస్, పూణెం కృష్ణ, వీరస్వామి, రాధ, రమాదేవి, కన్నరాజు, జగ్గా పుల్లయ్య, కుంజ శ్రీను, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండండి..



పేషంట్‌తో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ

చంద్రుగొండ: సీజనల్ వ్యాధుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, గ్రామాల వారీగా ముందస్తు చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ భాస్కర్‌నాయక్ సూచించారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీని సోమవారం ఆయన సందర్శించారు. రికార్డులు పరిశీలించారు. ఓపీ సంఖ్యపై ఆరాతీశారు. గ్రామాలవారీగా ఎప్పటికప్పుడు జ్వరాలపై సర్వే చేయించాలన్నారు. అవసరం ఉన్న ప్రతి గ్రామంలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు వైద్యం అందేలా చూడాలని వైద్యురాలు తనూజను ఆదేశించారు. అనంతరం స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మొక్క నాటారు.

ఆటో ఢీకొని ఒకరికి గాయాలు

కొత్తగూడెంటౌన్: మద్యం మత్తులో ఆటో నడిపి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన సోమవారం రుద్రంపూర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. రుద్రంపూర్‌తండాకు చెందిన ఆటోడ్రైవర్ జి.కిషన్ మద్యం మత్తులో ఎస్‌బీఐ లైన్ నుంచి రుద్రంపూర్‌కు ఆటోనడుపుతూ వెళ్తున్నాడు. వీకే వర్క్‌షాపు ఏరియాకు అప్రెంటిస్ కోసం రుద్రంపూర్‌కు చెందిన సంగం లలిత్‌కుమార్ ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. మద్యం మత్తులో బ్యాంకు ముందు నిలిపి ఉంచిన మూడు వాహనాలను ఢీకొట్టుకుంటూ వచ్చిన కిషన్.. లలిత్‌కుమార్ బైక్‌ను సైతం ఢీకొట్టడంతో అతడికి బలమైన గాయాలయ్యాయి. పోలీసులు కిషన్‌ను అదుపులోకి తీసుకున్నారు. క్షతగాత్రుడిని సింగరేణి ప్రధానాస్పత్రికి.. అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించారు. లలిత్‌కుమార్ తండ్రి కరుణకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ రమేశ్‌కుమార్ తెలిపారు.

రైస్ మిల్లు పైనుంచి పడి యువకుడికి...

కరకగూడెం: రైస్ మిల్లు మరమ్మతులు చేస్తుండగా ఓ యువకుడు కిందపడి తీవ్ర గాయాల పాలైన ఘటన మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని పద్మాపురం గ్రామానికి చెందిన పోగు విశ్వతేజ సోమవారం తమ ధాన్యం మిల్లు మరమ్మతులు చేస్తుండగా అదుపుతప్పి మిల్లు పైనుంచి కిందపడ్డాడు. తలకు తీవ్ర గాయం కావడంతో స్థానిక ఓ ప్రైవేట్ వైద్యశాలలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్ తరలించారు.

విద్యుదాఘాతంతో ఒకరికి..

ఇల్లెందురూరల్: మండలంలోని మాణిక్యారం గ్రామ పంచాయతీ ఎల్లాపురం గ్రామానికి చెందిన గుగులోత్ సతీశ్ సోమవారం విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. ఎల్లాపురం గ్రామ శివారులో విద్యుత్ తీగలు తెగిపోవడంతో సరఫరా నిలిచిపోయింది. ఈ విషయాన్ని రైతులు నేరుగా విద్యుత్ శాఖ లైన్‌మెన్‌కు తెలిపారు. దూర ప్రాంతంలో విధుల్లో ఉన్న లైన్‌మెన్ ఎల్‌సీ ఇప్పించి లైన్ సరిచేసుకోవాలని రైతులకు సూచించారు. దీంతో స్థానికంగా స్తంభాలు ఎక్కడం, జాయింట్ చేయడంలో అనుభవం ఉన్న సతీశ్‌తోపాటు మరో ఇద్దరి సాయంతో పనులు ప్రారంభించారు. స్తంభం ఎక్కిన సతీశ్ లైన్ సరిచేస్తుండగా సమీపంలో ఇదే లైన్‌ను క్రాస్ చేస్తున్న మరో లైన్ తీగలు తగలడంతో విద్యుదాఘాతానికి గురై పైనుంచి కిందపడ్డాడు. స్థానికులు సతీశ్‌ను ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రికి.. అక్కడి నుంచి ఖమ్మం తరలించారు.

అంతర్ జిల్లా దొంగల అరెస్ట్



నిందితులను చూపిస్తున్న సీఐ వినయ్‌కుమార్

పాల్వంచ: పలు ఇళ్లల్లో చోరీలకు పాల్పడిన ఇద్దరిని పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. పాల్వంచ సీఐ వి.వినయ్‌కుమార్ వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. ఈనెల 4న నటరాజ్ సెంటర్‌లో పట్టణ ఎస్‌ఐ రాఘవయ్య వాహన తనిఖీలు చేపట్టగా అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించారు. సదరు వ్యక్తి ఆటోడ్రైవర్ తూరపాటి ప్రసాద్ అని తెలగా ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం వీఎం.బంజరకు చెందిన ఆయన హైదరాబాద్ అల్వాల్ ఏరియాలో ఉంటున్న పాత నేరస్తుడిగా గుర్తించారు. జూన్ 28వ తేదీన పాల్వంచ ఒడ్డుగూడెం ఏరియాలో 49 గ్రాముల బంగారం, 500 గ్రాముల వెండి, రూ.20 వేల నగదు చోరీ చేసి హైదరాబాద్ ముత్తూట్ ఫిన్‌కార్ప్‌లో తాకట్టు పెట్టినట్లు తేలింది. అంతేకాక కొంత బంగారం అమ్మి రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ కొనుగోలు చేసిన ప్రసాద్ గతంలో వరంగల్, ఖమ్మం, పాల్వంచ, మణుగూరు, కాజీపేట, హసన్‌పర్తి ఏరియాల్లో 30 చోరీలకు పాల్పడి జైలుకు వెళ్లి వచ్చాడని సీఐ తెలిపారు. ఈ ఏడాది పాల్వంచలోనే కాక ఖమ్మం దొరన్నకాలనీ, టీఎన్జీవోస్ కాలనీ, అశ్వాపురం మండలం మొండికుంట, కోదాడలోని పెరిక హాస్టల్, సర్దార్ వల్లభాయ్ పటేల్‌నగర్ రోడ్‌లో చోరీలు చేసినట్లు ఒప్పుకున్నాడని వెల్లడించారు. ఇక సోమవారం చేపట్టిన వాహన తనిఖీల్లో అనుమానాస్పదంగా కనిపించిన పాల్వంచ మండలం మొండికట్టకు పొన్నాల శివశంకర్‌ను అదుపులోకి తీసుకోగా ఐఎం కాలనీ, కరీంనగర్, జమ్మికుంట, రామగిరి, గోదావరి ఖని ఏరియాల్లోనూ చోరీలకు పాల్పడినట్లు తేలిందని సీఐ వినయ్‌కుమార్ తెలిపారు. ఆయనను నుంచి ఖమ్మంలో చోరీ చేసిన రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌ను స్వాధీనం చేసుకోగా.. ఇద్దరిని రిమాండ్‌కు తరలించామని వెల్లడించారు.

వాగు తెచ్చిన తంటా..

అవస్థలు పడుతూ దహన సంస్కారాల నిర్వహణ




కట్టెలు తరలిస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు

ఇల్లెందు: ఇల్లెందులపాడు అలుగు వాగు బ్రిడ్జి నిర్మించకపోవడంతో రెండేళ్లుగా దహన సంస్కారాల నిర్వహణ నరకంగా మారుతోంది. ఇల్లెందులపాడులో హిందూ శ్మశానవాటిక అలుగు వాగు అవతల ఉంది. ఎవరైనా మృతి చెందితే వాగు దాటి వెళ్లి ఖననం చేయాలి. రెండేళ్ల కిందట కురిసిన వర్షాలకు ఈ అలుగువాగు మీద ఏర్పాటు చేసిన బ్రిడ్జి తెగిపోయింది. నాటి నుంచి శ్మశానవాటికకు వెళ్లటం కష్టంగా మారింది. సోమవారం ఇల్లెందులపాడుకు చెందిన గుండా శంకర్ మృతి చెందగా అంతిమ సంస్కారం కోసం తెచ్చిన కట్టెలను వాగు దాటించి శ్మశానవాటికలోకి తరలించటం కుటుంబ సభ్యులు, బంధువులకు తలకు మించిన భారంగా మారింది. అక్కడి కౌన్సిలర్ కటకం పద్మావతి కొందరు యువకులతో కలిసి కట్టెలను ఈ ఒడ్డు నుంచి ఆ ఒడ్డుకు తరలించారు. ఇదిలాఉండగా మృతదేహాన్ని సైతం వాగు దాటించడం నరకప్రాయంగా మారింది.





సాక్షి క్లాసిఫైడ్స్



YIP PVT LTD recruits Male of Female Age 18 to 45, Qul:- 10th to Any Degree, Salary 18000 and above work from home facility is available 8121818692 [G-8984]

ఒమేగాహోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు ఇంటిపని/వంట పనికు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం.జీ20K.ఫోన్: 8977639662 / 8977639663 [H-796262]

సాక్షి ద్వారా మీ చిన్నారి పుట్టిన రోజు శుభాకాంక్షలను తెలియజేయండి
కేవలం రూ. 500/- మాత్రమే
(GST 5% అదనం)

ఈ పేజీలో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి
వివరాలకు :
ఖమ్మం : 9010299957, 9705444182
కొత్తగూడెం : 9010223783
పాల్వంచ : 9705444183
భద్రాచలం : 9951602914

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.